




EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
20-11-2025
పేజీలు: 02


# విదేశీ టెక్ నిపుణులను అమెరికాకు స్వాగతిస్తామన్న ట్రంప్



వలసల విషయంలో తన కఠిన వైఖరికి భిన్నంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని టెక్నాలజీ పరిశ్రమల అభివృద్ధికి విదేశీ నిపుణుల అవసరం ఎంతో ఉందని, అమెరికన్లకు శిక్షణ ఇచ్చేందుకు వేలాది మందిని ఆహ్వానిస్తానని ఆయన స్పష్టం చేశారు. చట్టబద్ధమైన వలసలను తాను మనస్ఫూర్తిగా స్వాగతిస్తానని తెలిపారు. వాషింగ్టన్‌లో బుధవారం జరిగిన యూఎస్-సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరంలో ట్రంప్ మాట్లాడుతూ.. "అరిజోనాలో బిలియన్ల డాలర్ల పెట్టుబడితో భారీ కంప్యూటర్ చిప్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి, నిరుద్యోగులతో దాన్ని నడపలేరు. అందుకు నైపుణ్యం కలిగిన వేలాది మంది అవసరం. అలాంటి వారిని విదేశాల నుంచి తీసుకురావాల్సి ఉంటుంది. నేను వారిని స్వాగతిస్తాను" అని అన్నారు. ఈ విదేశీ నిపుణులు మన అమెరికన్లకు కంప్యూటర్ చిప్స్ తయారీ వంటి సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తారని ఆయన వివరించారు.ఈ నిర్ణయం వల్ల తన సొంత పార్టీలోని సంప్రదాయవాదులు, 'మాగా మద్దతుదారుల నుంచి కొంత వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. "నా స్నేహితుల నుంచి విమర్శలు రావొచ్చు. కానీ ఇది కూడా 'మాగా' కోసమే. విదేశీ నిపుణులు వచ్చి మన వాళ్లకు శిక్షణ ఇస్తారు అని ఆయన స్పష్టం చేశారు.అయితే, ట్రంప్ వ్యాఖ్యలపై రిపబ్లికన్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్జోరీ టేలర్ గ్రీన్ వంటి నేతలు హెచ్1-బీ వీసాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన వైట్‌హౌస్, వీసా దుర్వినియోగాన్ని అరికట్టేందుకే లక్ష డాలర్ల దరఖాస్తు రుసుమును ప్రతిపాదించామని, ఇది అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతుందని తెలిపింది. 2024లో జారీ అయిన మొత్తం హెచ్1-బీ వీసాలలో 70 శాతానికి పైగా భారతీయులే పొందడం గమనార్హం. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు భారతీయ టెక్ నిపుణులకు కొంత ఊరటనిచ్చేవి అనడంలో ఎలాంటి సందేహం లేదు.




## 10వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నితీశ్ కుమార్

బీహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. జేడీయూ అధినేత నితీశ్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నేడు ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్.. నితీశ్ కుమార్ చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నితీశ్ కుమార్ అరుదైన రికార్డు నెలకొల్పారు. బీహార్ ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణం చేసిన నేతగా రికార్డు సృష్టించారు. ఇక ఇదే కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలుగా సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ప్రమాణం చేశారు. బీజేపీకి చెందిన 14 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, ఏపీ సీఎం చంద్రబాబు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సహా ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు. కాగా, ఇటీవలే జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ అధినేత నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గానూ 202 స్థానాల్లో జయకేతనం ఎరుగవేసింది. ఇందులో బీజేపీకి 89, నితీశ్ కుమార్‌కు చెందిన జేడీ(యూ)కు 85, కూటమి పార్టీలైన ఎల్‌జేపీ (రామ్ విలాస్)కి 19, హెచ్ఏఎం 5 , ఆర్ఎల్ఎస్‌పీ 4 సీట్లలో విజయం సాధించాయి.



## శంషాబాద్‌లో కాల్పుల కలకలం

హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు కిరాయి విషయంలో గొడవ పడ్డారు. దీంతో ఓ వ్యక్తి ఎయిర్ గన్‌తో మరో ప్రయాణికుడిని కాల్చాడు. శంషాబాద్ మండలం నర్కుడా వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల మధ్య కిరాయి విషయంలో వాగ్వాదం చోటుచేసుకున్నది. అదికాస్తా పెద్దది కావడంతో సమీర్‌దాస్ అనే ప్రయాణికుడిని, మరో ప్రయాణికుడు ఎయిర్ గన్‌తో కాల్చాడు. దీంతో సమీర్‌దాస్ కడుపులో తీవ్ర గాయమైంది. స్థానికులు అతడిని హుటాహుటిన దవాఖానకు తరలించారు.



## భారత్‌కు రానున్న డొనాల్డ్ ట్రంప్ జూనియర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరగనున్న ఓ అమెరికన్ వ్యాపారవేత్త కుమారుడి వివాహానికి కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు. నవంబర్ 21, 22 తేదీల్లో జరిగే ఈ వివాహానికి ఆయనతో పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు కూడా వస్తున్నారు. ఈ నేపథ్యంలో, అమెరికా సీక్రెట్ సర్వీసెస్ బృందం ఉదయ్‌పూర్‌కు చేరుకొని ఏర్పాట్లను సమీక్షిస్తోంది. నగర పోలీసులు విమానాశ్రయం నుంచి ప్యాలెస్ వరకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.



## రామయ్య సన్నిధిలో చక్కెర పొంగలి చోరులు.. దక్షిణ అయోధ్యలో మామూలు స్కామ్ కాదుగా..

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామయ్య ఆలయ ప్రసాద పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో చక్కెర పొంగలి అక్రమంగా తరలిస్తూ కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించారనే హడావుడి జరిగింది. భద్రాచలం పట్టణానికి చెందిన భక్తులు 5 కిలోల చక్కెర పొంగలి తయారు చేయించి తీసుకెళ్తున్న క్రమంలో భద్రతా సిబ్బంది ఆపి తనిఖీ చేశారు. తూకం వేయడంతో 32 కిలోల బరువు వచ్చింది. అయితే.. సదరు భక్తులు తాము నిబంధనల ప్రకారం కిలోకి 400రూపాయల చొప్పున 2 వేలు చెల్లించామని చెప్పడంతో వారికి ఇబ్బంది కలుగకుండా అధికారుల ఆదేశాలతో వారిని పంపించారు. కానీ.. ఐదు కిలోలకు 32కిలోల చక్కెర పొంగలి ఎలా వచ్చిందనేది అయోమయానికి గురిచేసింది. అలర్ట్ అయిన భద్రాద్రి ఆలయ ఈఓ దామోదరరావు మరోసారి భద్రతా సిబ్బంది సమక్షంలో ఐదు కిలోల చక్కెర పొంగలి తయారు చేసి తూకం వేయగా అది 36 కిలోలు ఉన్నట్లు గుర్తించారు. ఈ లెక్కన పద్ధతి ప్రకారమే జరిగిందనే నిర్ణయానికి వచ్చారు ఆలయ అధికారులు. ఇదిలావుంటే.. ఎక్కడైనా ఆలయాల్లో తయారైన ప్రసాదం ప్యాకెట్ల లెక్కన భక్తులకు అందిస్తుంటారు. కానీ.. భద్రాద్రి ఆలయంలో మాత్రం భక్తులు ముందుగా ఆర్డర్ ఇస్తే తయారీ చేసి సరఫరా చేస్తారు. ఇదే అదనుగా అక్రమాలు కూడా చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

## గుడ్డు ధర రూ.8

గుడ్డు వెరి గుడ్ అనేవారు కానీ.. కోడిగుడ్డు ధరలు పెరుగుతున్న విధానం చూస్తుంటే వెరీ బ్యాడ్ అనుకుంటున్నారు. మాంసాహారం భుజించలేని సామాన్యులకు గుడ్లు అందుబాటులో ఉండేవి. కానీ గుడ్డు ధర ఉన్నట్టు ఉండి అమాంతంగా పెరిగి పోతుండడంతో చికెన్ ధరలకు చేరుకుంటుంది. జిల్లాలో కోడిగుడ్డు రిటైల్ ధర గత కొన్ని రోజుల కింద రూ.5 నుంచి రూ.6.50 వరకు ఉండగా ప్రస్థుతం మార్కెట్‌లో గుడ్డు ధర రూ.8కి చేరిపోయింది. గత వర్షాకాలంలో కనివిని ఎరుగని రీతిలో వర్షాలు కురిశాయి. కురిసిన అతివృష్టితో కూరగాయలు అంతంత మాత్రమే అందుబాటులోకి వస్తుండడంతో కూరగాయ ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. కిలో టమోటా రూ.50కాగా వంకాయలు కిలో రూ.120, బీరకాయలు రూ.100, దొండకాయలు కిలో రూ.80, సోరకోయలు ఒక్కొటి రూ.30 నుంచి రూ.50కి, ఆకుకూరలు ఒక కట్ట రూ.20 నుంచి రూ. 30కి విక్రయిస్తున్నారు. కూరగాయల ధరలతో సమానంగా కోడిగుడ్డు ధర పెరగడంతో సామాన్యుల పరిస్థితి అగమ్యఘోచరంగా మారింది. శాకాహారం తినాలన్న ఆకాంక్షను తగ్గించుకోవడంతో పాటు గుడ్డు ధర కూడా పెరిగి పోవడంతో చికెన్ కొనుక్కుంటే మేలని ప్రజలు భావిస్తున్నారు.





## 5 వేల మందికే స్పాట్ బుకింగ్.. అయినా కిక్కిరిసిన శబరిమల క్యూలైన్లు

శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం భక్తులు వేల సంఖ్యలో హాజరవుతున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. అయితే రద్దీని తగ్గించేందుకు స్పాట్ బుకింగ్ టికెట్లను 5 వేలకు పరిమితి చేశారు. ప్రతి రోజూ 20 వేల స్పాట్ బుకింగ్ టికెట్లను జారీ చేసే స్థానంలో.. ఇప్పుడు ఆ సంఖ్యను తగ్గించారు. కోర్టు ఆదేశాల ప్రకారం స్పాట్ బుకింగ్‌ను 5 వేల మందికి పరిమితం చేశారు. అయినా పంబా, నీలక్కల్ వద్ద ఉన్న కౌంటర్ల సమీపంలో భారీ సంఖ్యలో భక్తులు బారులు తీశారు. ప్రస్తుతం నీలక్కల్, వండిపెరియార్ సెంటర్ల వద్ద మాత్రమే స్పాట్ బుకింగ్ టికెట్లు ఇస్తున్నారు. పంబా, ఎరుమేలి, చెంగనూరు వద్ద ఉన్న కౌంటర్లను తాత్కాలికంగా మూసివేశారు. నవంబర్ 24వ తేదీ వరకు ఇవే ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. హైకోర్టు ధర్మాసనం జస్టిస్ ఏ రాజా విజయరాఘవన్, కేవీ జయకుమార్ ఇచ్చిన ఆదేశాలతో స్పాట్ బుకింగ్ పాసుల సంఖ్యను తగ్గించారు.



## చాలా బాధగా ఉంది

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్కులేట్ అవుతున్న AI మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా AI వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా AI సమస్యగా మారుతోంది. AI మన కోసం పనిచేయాలి, అంతేకానీ మనల్ని ఇబ్బంది పెట్టకూడదు అని ఆమె అభిప్రాయపడ్డారు. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, AI దుర్వినియోగంపై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

## మార్కెట్‌లోకి మరో కొత్త భారతీయ స్మార్ట్ ఫోన్ కంపెనీ





భారతీయ స్మార్ట్ ఫోన్ మార్కెట్ లోకి మరో నూతన దేశీయ కంపెనీ ప్రవేశించింది. ఇండ్‌కాల్ టెక్నాలజీస్ సంస్థ నూతనంగా వాబుల్ అనే స్మార్ట్ ఫోన్ బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఇందులో భాగంగానే వాబుల్ వన్ పేరిట తన తొలి స్మార్ట్ ఫోన్‌ను మార్కెట్‌లో విడుదల చేసింది. ఇందులో పలు ఆకట్టుకునే ఫీచర్లను అందిస్తున్నారు. వాబుల్ వన్ ఫోన్‌లో 6.67 ఇంచుల ఫ్లాట్ అమోలెడ్ డిస్‌ప్లేను ఏర్పాటు చేశారు. ఇది ఫుల్ హెచ్‌డీ ప్లస్ రిజల్యూషన్‌ను, 120 హెర్జ్ రిఫ్రెష్ రేట్‌ను కలిగి ఉంది. ఈ డిస్‌ప్లే డాల్బీ విజన్‌ను అందిస్తుంది. కనుక డిస్‌ప్లే చాలా క్వాలిటీగా ఉంటుంది. అద్భుతమైన దృశ్యాలను వీక్షించవచ్చు. ఈ ఫోన్‌లో మీడియాటెక్ డైమెన్సిటీ 7400 ఆక్టాకోర్ ప్రాసెసర్‌ను ఏర్పాటు చేశారు. 12జీబీ వరకు ర్యామ్ లభిస్తుంది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




# మౌంట్ అబూ టెలిస్కోప్‌కు చిక్కిన 3I/ATLAS తోకచుక్క




3I/ATLAS తోకచుక్కకు చెందిన కొత్త ఇమేజ్‌ను ఇస్రో రిలీజ్ చేసింది. మౌంట్ అబూలోని 1.2 మీటర్ల టెలిస్కోప్‌కు ఆ తోకచుక్క చిక్కింది. ఈనెలలోనే ఆ తోకచుక్కను తమ కెమెరాల్లో బంధించినట్లు ఇస్రో వెల్లడించింది. చాలా వైభవంగా వెలుగుతున్న న్యూక్లియస్ చుట్టూ బ్లూ-గ్రీన్ రంగులో వలయం ఉన్నట్లు గుర్తించారు. అయితే సౌర కుటుంబం దిశగా దూసుకువస్తున్న సమయంలో ఆ తోకచుక్క చుట్టు ఉన్న వాయు గోళం, ధూళి క్రమంగా విస్తరిస్తుంటుంది. 3I/ATLAS తోకచుక్క మన సౌరకుటుంబానికి అవతలే ఉన్నా.. అది మన సౌర వ్యవస్థలో ఉన్నట్లుగా ప్రవర్తిస్తున్నదని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సాధారణ తోకచుక్కలతో పోలిస్తే 3I/ATLAS భిన్నంగా ఉన్నట్లు ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరో సౌర వ్యవస్థకు చెందిన తోకచుక్కను గుర్తించడం ఇది మూడోసారి. 2017లో ఓముమౌమా, 2019లో బోరిసోవ్ తోకచుక్కలను ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇంటర్‌స్టెల్లార్ ఆబ్జెక్ట్స్‌గా గుర్తించే తోకచక్కలు సుదూర నక్షత్ర మండలం నుంచి వస్తున్నట్లు భావిస్తున్నారు. నాసా కూడా ఆ తోకచుక్కకు చెందిన కొత్త ఇమేజ్‌లను రిలీజ్ చేసింది. మార్స్ రికన్నైసెన్స్ ఆర్బిటార్ కెమెరాలు అక్టోబర్ 2న తీసిన ఫోటోలను బుధవారం నాసా రిలీజ్ చేసింది.

# ఆ డైట్ అస్సలు పాటించకండి అంటున్న మాళవిక

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది.అయితే ఓ సినిమా కోసం మాళవిక కేవలం రెండు వారాల్లోనే 8 కిలోల బరువు పెరిగిందట. అంతకు ముందు 14 రోజుల్లోనే బరువు తగ్గింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. తన ఫిట్నెస్ సిక్రెట్ రివీల్ చేసింది. ఒక సినిమాలో తన పాత్ర కోసం కేవలం 14 రోజుల్లోనే 8 కిలోల బరువు తగ్గిందట. అది తనకు చాలా కష్టమైన దశ అని చెప్పుకొచ్చింది.తక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకున్నానని.. అదే సమయంలో శారీరకంగా చాలా కష్టపడి స్టంట్స్, యాక్షన్ సీన్ రిహార్సల్స్ చేయడం శరీరంపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి తెలిపింది. శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం,



# 252 కోట్ల డ్రగ్స్ కేసు.. సోషల్ మీడియా స్టార్ ఓరీకి ముంబై పోలీసుల సమన్లు!

బాలీవుడ్‌తో పాటు సోషల్ మీడియాలో నిత్యం వార్తల్లో ఉండే ప్రముఖ ఇన్‌ఫ్లుయెన్సర్ ఓర్హాన్ అవత్రామణి, అలియాస్ ఓరీ ఒక భారీ డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నారు. దాదాపు రూ. 252 కోట్ల విలువైన మాదకద్రవ్యాల కేసు విచారణలో భాగంగా హాజరు కావాలంటూ ముంబై పోలీసులు ఓరీకి సమన్స్ జారీ చేశారు. ముంబై పోలీసులకు చెందిన యాంటీ-నార్కోటిక్స్ సెల్ ఘాట్‌కోపర్ యూనిట్ ఓరీని విచారణ నిమిత్తం పిలిపించింది. మార్చి 2024లో సంచలనం సృష్టించిన ఈ కేసులో మహారాష్ట్రలోని సాంగ్లీలో ఉన్న ఒక ఫ్యాక్టరీలో 126.14 కిలోల మెఫెడ్రోన్ (MD) ను పోలీసులు సీజ్ చేశారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ. 252 కోట్లు. ఈ కేసులో ప్రధాన డ్రగ్స్ ట్రాఫికర్ అయిన మహ్మద్ సలీం మొహమ్మద్ సుహైల్ షేక్‌ను దుబాయ్ నుండి అరెస్ట్ చేసి తీసుకువచ్చారు. విచారణ సందర్భంగా షేక్, పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలతో పాటు ఓరీ పేరును కూడా ప్రస్తావించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే నిందితుడు మహ్మద్ సలీం షేక్ ఇచ్చిన వాంగ్మూలం ఎంతవరకు నిజమనే విషయాన్ని ధృవీకరించడానికి ఓరీని ప్రశ్నించబోతున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ముంబై, దుబాయ్‌లలో షేక్ నిర్వహించిన రేవ్ పార్టీలలో ఓరీ ప్రమేయం ఎంతవరకు ఉందనే దానిపై పోలీసులు దృష్టి సారించారు. పోలీసు వర్గాలు వెల్లడించిన దాని ప్రకారం, ఈ కేసులో ఓరీపై ఇప్పటివరకు ఎటువంటి చట్టపరమైన అభియోగాలు నమోదు కాలేదు. ప్రస్తుతం ఇది కేవలం దర్యాప్తులో భాగమైన విచారణ ప్రక్రియ మాత్రమే అని అధికారులు స్పష్టం చేశారు. కాగా దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



# ఆగకుండా 5,000 కి.మీ. ప్రయాణించిన గద్దలు

మణిపూర్ నుంచి బయల్దేరిన మూడు గద్దల్లో రెండు సోమాలియాకు సురక్షితంగా చేరుకున్నాయి. మణిపూర్ అమూర్ ఫాల్కన్ ట్రాకింగ్ ప్రాజెక్టులో భాగంగా వీటిని పంపించారు. యుక్త వయసు గల మగ గద్ద అపాపంగ్, తక్కువ వయసు గల ఆడ గద్ద అలంగ్, యుక్త వయసు గల ఆడ గద్ద అహు ఈ నెల 11న బయల్దేరాయి. వీటికి మణిపూర్ అడవుల్లో శాటిలైట్ ట్యాగ్స్‌ను అమర్చారు. ఇవి మధ్య భారతంలో దాదాపు 3,100 కి.మీ., అరేబియా సముద్రంపై నుంచి ప్రయాణించి సోమాలియా చేరుకోవలసి ఉంటుంది. వీటిలో అపాపంగ్ మొదట సోమాలియాకు చేరుకుంది. ఇది 76 గంటలపాటు ఎక్కడా ఆగకుండా ప్రయాణించింది. ఆ తర్వాత అలంగ్ సోమాలియాకు చేరుకుంది. మూడో గద్ద అహు సోమాలియాకు చేరువలో ఉంది. తమిళనాడు పర్యావరణం, వాతావరణ మార్పులు, అడవుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియ సాహు ఈ వివరాలను ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ అమూర్ గద్దలు అంతరించిపోయే దశలో ఉన్నాయన్నారు. వీటి బరువు 150 గ్రాములు ఉంటుందన్నారు.




# ఐబొమ్మ వన్‌పై పోలీసుల క్లారిటీ

ఆన్‌లైన్‌లో మరో పైరసీ వెబ్‌సైట్ గురించి జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు తర్వాత.. తెరపైకి ఐబొమ్మ వన్ అనే వెబ్‌సైట్ వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు క్లారిటీ ఇచ్చారు. ఐబొమ్మ వన్ సైట్ ఓపెన్ అవ్వడం లేదని స్పష్టం చేశారు. 'ఐబొమ్మ వన్ వెబ్‌సైట్‌లో కొత్త సినిమాలు పైరసీ అయ్యాయన్న ప్రచారంలో వాస్తవం లేదు. అందులో మూవీస్‌కి సంబంధించి రివ్యూస్ మాత్రమే ఉన్నాయి. అది ఓపెన్ చేస్తే మూవీ రూల్జ్‌కి రీడైరెక్ట్ అవ్వడం లేదు. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్లను ఇప్పటికే బ్లాక్ చేయించాం. వేరే వెబ్ సైట్ల ద్వారా పైరసీకి పాల్పడితే వాటి దిశగా దర్యాప్తు చేస్తాం. మరికొద్ది సేపట్లో ఇమ్మడి రవిని కస్టడీలోకి తీసుకోబోతున్నాం' అని వెల్లడించారు. కరేబియన్ దీవుల్లో పెద్ద నెట్‌వర్క్ ఏర్పరచుకుని బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడమే కాకుండా సినిమాలను పైరసీ చేసి అప్‌లోడ్ చేస్తున్నందుకు ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ వన్ ప్రత్యక్షమైనట్లు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఏదైనా సినిమాను క్లిక్ చేస్తే నేరుగా 'మూవీ రూల్జ్'కు రీడైరెక్ట్ అవుతోందని వార్తలు వచ్చాయి. దీంతో సైబర్ క్రైమ్ పోలీసుల క్లారిటీతో వీటికి చెక్ పడింది.

# గాజా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు.. పదుల సంఖ్యలో పాలస్తీనియన్లు మృతి




కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాలస్తీనాపై ఇజ్రాయెల్ దళాలు మరోసారి దాడులకు పాల్పడ్డాయి. గాజా నగరాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశాయి. గాజా, ఖాన్ యూనిస్‌పై క్షిపణుల వర్షం కురిపించాయి. ఈ దాడుల్లో దాదాపు 25 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రముఖ వార్తా సంస్థ అల్ జజీరా తెలిపింది. సుమారు 77 మంది గాయపడినట్లు వెల్లడించింది. ఐడీఎఫ్ దాడులు జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను తాకాడంతో ప్రాణనష్టం అధికంగా ఉన్నట్లు తెలిపింది. హమాస్ ఉగ్రవాదులు తమ దేశంపై దాడికి పాల్పడేందుకు ప్రయత్నించడంతోనే స్ట్రైక్స్ చేసినట్లు ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఇదిలా ఉండగా.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. దక్షిణ లెబనాన్‌లోని పాలస్తీనా శరణార్థి శిబిరంపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 10 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు లెబనీస్ ప్రజారోగ్య మంత్రిత్వ శాఖను ఉటంకిస్తూ అల్ జజీరా నివేదించింది. హమాస్, హెజ్‌బొల్లా నెట్‌వర్క్‌లే లక్ష్యంగా ఈ వైమానిక, డ్రోన్ దాడులు నిర్వహిస్తున్నామని ఇజ్రాయెల్ పేర్కొంది. కాగా, అమెరికా మధ్యవర్తిత్వంతో అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణను ధిక్కరించి గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ వరుస దాడులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ 393 దాడులు చేసినట్లు అల్ జజీరా నివేదించింది. ఈ దాడుల్లో దాదాపు 280 మంది మరణించారు. సుమారు 672 మంది గాయపడ్డారు.

# ఫైనల్లో నిఖత్ వరల్డ్ బాక్సింగ్ ఫైనల్స్




ప్రతిష్టాత్మక వరల్డ్ బాక్సింగ్ ఫైనల్లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతున్నది. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్(51కి)..మెగాటోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. నిఖత్‌తో పాటు జాస్మిన్ లంబోరియా(57కి), జాదుమణిసింగ్(50కి), పవన్ బర్తాల్(55కి), సచిన్ సివాచ్(60కి), హితేశ్ గులియా(70కి) తుది పోరుకు అర్హత సాధించారు. తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ సెమీస్ బౌట్ విషయానికొస్తే..21 నెలల పతక నిరీక్షణకు తెరదించుతూ సత్తాచాటింది. భుజం గాయం నుంచి పూర్తిగా కోలుకున్న నిఖత్.. ఉబ్బెకిస్థాన్ బాక్సర్ గనీవా గుల్సెవర్‌పై 5-0తో ఏకపక్ష విజయం సాధించింది. గతేడాది ఫిబ్రవరిలో స్ట్రాంజా స్మారక టోర్నీ గెలిచిన తర్వాత ఇన్ని రోజులకు నిఖత్ తనదైన రీతిలో అదరగొట్టింది.

# అండర్-19 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల



వచ్చే ఏడాది జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న పురుషుల అండర్-19 వన్డే ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఐసీసీ బుధవారం విడుదల చేసింది. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకూ సాగే ఈ మెగా టోర్నీలో 16 జట్లు 41 మ్యాచ్‌లు ఆడనున్నాయి. దాదాపు ప్రతి ఐసీసీ టోర్నీలో ఒకే గ్రూపులో ఉండే చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్.. ఈసారి వేర్వేరు గ్రూపుల్లో ఆడనున్నాయి. 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించగా గ్రూప్ ఏలో భారత్, బంగ్లాదేశ్, యూఎస్ఏ, న్యూజిలాండ్ ఉండగా 'బీ'లో జింబాబ్వే, పాకిస్థాన్, ఇంగ్లండ్, స్కాట్లాండ్ ఆడతాయి. 'సీ'లో ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక పోటీపడనుండగా 'డీ'లో టాంజానియా, వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. రౌండ్ రాబిన్ విధానంలో జరుగబోయే ఈ టోర్నీలో భారత జట్టు.. జనవరి 15న యూఎస్ఏతో ఆడబోయే మ్యాచ్‌తో టోర్నీ మొదలుకానుంది.